

2020010003927

అమృతాభిషేకము



అమృతాభిషేకము

(ఖండ కావ్యం)

దాశరథి



క్వాలిటీ పబ్లిషర్సు
విజయవాడ-2

క్వాలిటీ ప్రచురణ
ప్రథమ ముద్రణ
ఏప్రియల్ 59

వెల
1-50

మేనేజింగ్ ఎడిటరు
మురళీకృష్ణ

ఎడిటర్
రామారావు

ముద్రణ
ఆంధ్రా ప్రింటర్సు
విజయవాడ-2.

అంకితము

ఆప్తులు

డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారికి

శాంతినికేతన ప్రసవసౌరభముల్ తెలుగింటిలోన వి
శ్రాంతముగా చరించునటు సల్పి త్రిలింగము వంగమేకసూ
త్రాంతర సన్నిబద్ధమగునట్టులొనర్చిన నీకు నేను క
ల్పింతును హస్తినా నవపురీంద్రమునందమృతాభిషేకమున్

ఉరుదు ముషాయిరాలనిన నువ్విళులూరుదుమీవు నేను,సం
బరపడివిందు మాంధ్రకవిమాన్యులసత్కవితానులాపముల్
పరువిడి వంగసత్కవితపై అనురాగము వెల్లడింతు మి
ట్టిరువిరి రాగబంధమున కెన్నోసమానగుణమ్ములొప్పెడిన్

సకలాంధ్రమ్మొకటై తెనుంగు జనులిచ్చావృత్తిజీవించుకో
రిక తెల్గాణమునందు మా ఎదలలోరేకెత్త నీబాసటం
చొక హర్షాంకితమైనపల్కున శరజ్జ్యోత్స్నల్ ప్రసారించినా
వకళంకళంకంబగు నీమనశ్శశధర వ్యాకోచి కొండాడెదన్

నా 'మహాంధ్రోదయమ్ము' నానాడు నీవు
భాగ్యనగరి నావిష్కార పరచినావు
ఘూకములు తెల్లురేకల రాక జూచి
కుందగా వెల్గినట్టి రాకేందు వీవు

పసినాడే బ్రతుకెల్లమాతృచరణోపాంతంబునందుంచి సం
తసమొప్పారగ జాతిసేవకయి వంతల్ సైచి కారాగ్రహా
గ్రసనమ్మున్ భరియించినట్టి నిను కేంద్రంబందునన్
జూచు మా
ఖుసికిన్ లెక్కలులేవు చెప్పుటకు శ్రీ గోపాలరెడ్డ్యగ్రణీ !

బహుభాషాకవులొక్కచోటసభసల్పన్ నీవునధ్యక్షతన్
వహియింపన్ కడునేర్పుతో సుకవితావ్యాసంగమున్
గూర్చి నీ
మహనీయ ప్రతిభావిశేషములు స్రమాట్ కృష్ణ
రాయాది ధూ
ర్వహులన్ జ్ఞప్తికిదెచ్చుచున్నయువి శుంభత్ కావ్య
గోపాలకా !

కలగన్న విశాలాంధ్రము
కడు వేచిన సాహితీ అకాడమి నిజమై
వెలసినవి నీవ అధ్య
క్షుడుగా సాహిత్య సంస్థశోభిలుచుండెన్

మంత్రివిగా అనేకవిధ మంత్రణముల్ గొనిగూడ, సాహితీ
మంత్రజపమ్ము నూన, వసమాన తపస్వివినీవు, నీకు దు
స్తంత్రములేవి లేవు కవితా యువతీ నవతా ప్రసన్న వా
క్తంత్రముదప్ప-నీ హృదయధామము వెల్గునుసార్వభౌమమై

మన చిరతరమైత్రీ బం
ధనమున నమృతాభిషేచనమ్మొనరింతున్
కొనుమిదె కవితాంజలి, మన
అనురాగము లినుమడించునట్లుగ, రెడ్డీ!

అనుక్రమణిక

ప్రకాశిక



సాంప్రదాయ సిద్ధంగా వస్తున్న కవిత్వానికి అలవాటు పడిన ఎక్కువమంది పాఠకులకు శ్రీ దాశరథి ఒక కల్పవృక్షంలాంటి వారు. ఆయన కలంనుండి వెలువడే ప్రతివాక్యం సాంప్రదాయ బద్ధమై పాఠకులకు నూతనోత్తేజాన్ని కలుగచేస్తుంది. అంతేకాదు శ్రీ దాశరథి జన్మతః కవి. చిన్న వయస్సులోనే 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని తన మాతృభూమిని కీర్తించారు. అచిరకాలంలోనే ఆంధ్రదేశంలో ప్రతిభావంతులైన కవియై అశేష ప్రజల ఆదరాభిమానాలు చూరగొన కలిగారు. నేటి కవులలో శ్రీ దాశరథి ప్రతిభావంతులు

పాతకొత్తల మేలు కలయికకు శ్రీ దాశరథి ఒక ఉదాహరణ.

మురళీ కృష్ణ.

" సుప్రభాతము "

ఉదయాద్రి బుజమెక్కి ఒకడు నవ్వెను చూడు
భూ దివమ్ములు వెల్గుపూలు పూచె,
ఉవిద తామరబుగ్గ నెవడో ముద్దిడె చూడు
మనసులో వలపు చందనమురాయ,
చిమ్మచీకటి కాల జిమ్మె నెవ్వడో చూడు
గుండెలోపలి తమోగుణము మాయ,
కనురెప్ప దుప్పటీ కప్పులాగె నెవండో
వెలుగు లోకాలు తల్పులను తీయ

వేయిచేతుల ధరణిని పిలచి పిలచి
కౌగిలించె నెవండో శృంగారి చూడు,
కానబడరాని దవ్య లోకాలు చూపి
తాను కనుమూయు లోకబాంధవుడు వాడు.

వీడటో నిద్రాణ పృథివి కన్నులమీది
చీకటి బరువు పోజిమ్మువాడు,
ఈతడేనా తమోఘాతమ్ము సిగలోన
మందారమాలిక మలచువాడు,
ఈతడే నటవె జీమూతమ్ములను పెంచి
జగతిపై ముత్యాలు చల్లువాడు,
ఈతడేనా జగద్ధితముకై గగనాన
కాలికి బలపమ్ము కట్టితిరుగు
ఈతడీతడె కావచ్చు నింద్ర దిశకు
పశ్చిమాశకు నడుమ రేబవలు నడచి
ఒకరి వృత్తాంత మొక్కరి కొసగి యొసగి
స్నిగ్ధ బంధమ్ము కూర్చెడి స్నేహితుండు.

ఇతడు లేకున్నచో ఏది పద్మాంగనా
ఫాలాన గోరోచనా లవమ్ము?
ఇతడు రాకున్నచో ఏది భూభామినీ
గల్లభాగాన బంగారు వన్నె ?
ఇతడు తేకున్నచో ఏది దిక్కామిని
తనువుపై పట్టుపీతాంబరంబు ?

ఇతడు పోకున్నచో ఏది నీలాకాశ
కచపాశమున చంద్రఖండశోభ ?

ఈతడే కాదె మన హృదయేప్సితమ్ము,
ఇతడు లేకున్న జగమెల్ల ఇరులె సుమ్ము,
సుప్రభాతమ్ము, లెమ్ము! తమఃప్రభావ
మంతరించెను రమ్ము, నిశాంతమునకు

దైహికారోగ్యమునెగాక తన కరాల
హృదయమందలి రుజ నెల్ల వదలగొట్టి
ఆత్మకానందమును కూర్చునట్టి వైద్యు
డతని కభివాదమొనరింతు నంజలింతు

పైపై బ్రాకి నభోమహాభవన శుంభద్గోపురాగ్రానకున్
దాపై ఆపయి క్రింది క్రిందులయి తా నంభోధి నంతర్హితుం
డై పూర్వాశకు నశ్వముల్ నడిపి ఘోరాంధ్యమ్ము మాయించువా
డాపద్బాంధవుడేగుదెంచెనదె లెమ్మా! సుప్రభాతమ్మునన్

చంద్రనిప్పుల పెనకోల సాచియెత్తి
గిరగిరన్ ద్రిప్పినట్లు రాతిరియు బవలు
దశదిశాభిత్తి భాగాలు తాకితాకి
తరలి వచ్చెడు చండ మార్తాండుగనుము

చేతనమ్ములకెల్ల సంప్రీతిగూర్చి
బీజములనుండి మొక్కలు వెలికి తీసి
తీవెలందున పుష్పాలుప్రోవుబోసి
జగతికి విలాసమును గూర్చె సౌరమూర్తి

కులుకుం దామరకన్నె నెన్నొసటిపై గోరాడు గోరోచనా
తిలకం బెంతటికాంతి చిమ్మెడినొ దిగ్దేశమ్ములన్ రత్న రా
శులు భాసించెను కోటి దీపములు సంశోభించుచుండాన; క
న్గొలకుల్ కాంతిలలెమ్ము భాస్కరుని చక్షుఃపక్షపాతమ్మునన్

ఎన్నడో ఇల్లెక్కి ఎల్గెత్తి కూసెను
కోమరయ్యా బంగారు కోడిపుంజు
ఎప్పుడో ఆకాశమెక్కి జండాలెత్తి
వెడలిపోయెను పెద్దవేగుచుక్క

ఎంత కాలంబాయెనేమొ చందురుడేగి,
పడమటింటను చేరి బవ్వళించి
ఎంత సేపాయెనో ఇరుల నీలాంబరం
బుతికి మాలిన్యమ్ము నూడ్చివేసి

ఇంక నిద్దురపోయెదవేమె, సుదతి!
ఇరులె కురులయి పడి మొగమెత్త నీక
బరువుగా నిన్ను నిద్రతో బాధపెట్టు,
తొలగ ద్రోచితి లెమ్ము మత్తు, విడిరమ్ము.

"అమృతపాతము"

మరల మాయింటి మల్లియమాటునుండి
చందమామ కన్పించె, మిళిందబృంద
మావహించిన చెంగల్వ అంబుజాక
రాంబువులనుండి తలయెత్తినట్లు-నేడు.

అతడు తొంగి చూచినపుడెల్ల అమృత పా
తమ్ము జరుగు, యౌవనమ్ము పెరుగు
కలతలెల్ల తరుగు, కవితాసరస్వతీ
మృదుపదాలు నాల్కమీద తిరుగు.

అతడు నా చిన్ననాడు దయాపయోధి,
నేడు కఠినునివోలె కన్పించినాడు,
నాడు నావెంట ఆడుకొన్నాడువాడు,
నేడు మిన్నెక్కి కూర్చుండినాడు-రాడు.

భీతిలేనివాడు ఖ్యాతికోరనివాడు
ఆకసమ్మునుండి దూకెమున్న
తనువు తనువదెల్ల వ్రణముల్త్రై పోయెను
మానలేదు నేటికైనగాని

బాధలోనకూడ, పలుకడు ఉలుకడు
మరలదూకుమాట మరచిపోడు,
వాని తెగువజూడ భయమౌను, ప్రియమౌను
ప్రాణభీతిలేని ప్రాణివాడు.

వాడు నన్ను విడచి పరువెత్తునను మాట
కలలలోన గూడ తలపలేము
దూర తీరమందు తారాసతీమణి
పిలిచినంత పరుగు వెట్టినాడు.

నన్ను విడచిపోయె మన్నువిడచిపోయె
మన్నులోని అసలు తన్ను విడచె
తారచూపు వలని తను వెల్ల కాంతింప
మన్నులోనలేని మహిమనందె.

ఒడలినిండ వ్రణములుండియు తారకా
బాహుబంధనమ్ము వలనవాడు
కాంతిమంతుడయ్యె కాంచనకేతని
భ్రాంతి గొలుపుమేని పసిమితోడ.

వానివలని రాత్రి వయసు వచ్చినదయ్యె,
ఇరుల ముసుగులను హరించెనతడు,
వాని భుజముజారి ప్రాకెవెన్నెల వల్వ
నగ్నమైన నభము నడుము చుట్టు.

ఒక్కనాడు కూడ నొరుల బాధింపని
కరుణగలుగు నేస్తకాడువాడు
నేడు పెచ్చుపెరిగి ఏడు లోకమ్ముల
కౌముదీ మహాగ్ని గాల్చినాడు.

వాడు నన్నుగూడ వదలడు, పసినాటి
బాంధవమ్ము దూరపరచినాడు,
గుండెపగిలి కూరుచుండిన నామీద
రేయి యెండ క్రుమ్మరించినాడు.

నేను వానిమీద బాణమేయగబోవ
తారకొప్పులోన తాను దాగు,
ఆమెకొప్పుకేమి యాపద గలుగునో
యనుచు దించినాడ నంబకమ్ము.

ఆమె కొప్పులోన అతడు చేమంతియై
అందగించులే ప్రియమ్ము నాకు
అతడామె గలసి యసితాంబుదమ్ముల
నవల ద్రోయులే జయమ్ము నాకు

తనువు గాల్చునట్టి ఇనునకు వెరతుము,
మనసుగాల్చు చందమామ ప్రియము,
మనసు కాలినపుడె జనియించు నవకళా
దివ్యలోకమందు దీప్తి రేఖ

గాయపడిన గుండె కనిపించు చంద్రుడై
దేహమనెడు గగనదేశమందు,
గుండెలోననుండి కురియుజ్యోత్స్నవృష్టి
నవ్యకావ్య దివ్యనదమునందు

ఇట్లు తలపోయుచున్న నన్నెట్లు చూచె
నేమొ చంద్రుడు-భువికి లంఘింపజూచె
గాయ పడునేమొయను భీతి కండువాను
రెండుచేతులవిచ్చి నిల్చుండినాను

భిక్షుకుని కరాల ప్రియురాలు విసరిన
హృదయః కబళమునకు ఉదహారింప
చందమామ తాను చనుదెంచి నా పాత్ర
వ్రాలినాడు- వట్టిజాలివాడు.

ఒడలెల్ల వెన్నెలలతో
తడియగ నను కౌగలించి, తాతెచ్చిన పూ
తొడవులిడినాకు, ప్రేముడి
కడలివలెన్ పొంగ, గుండెకదలగపలికెన్

"చిరకాలమిట్లు నినువిడి.
ధరణిని విడనాడి గగన తలమున నిలువన్
దురితము వాటిల్లె సుహృ
ద్వర! మన్నించెదవో లేక ! దండించెదవో

నీతోనే నివసించెద
నీతోని మృత్తికా పునీతస్థలిలో
చేతః ప్రీతిగ నాడెద,
గీతములను వ్రాయుటందు కేలుగలిపెదన్

మనుజుడు పంపెడి కృత్రిమ
వనజారులతోడ గగనభాగము నిండెన్,
ననుగాంచువార లెవ్వరు
కనరారిక-నాకు దివిని కాపురమేలా!

నాపై దాడి యొనర్పఁ జూచెదరు
బాణవ్రాతముల్ చిమ్మి - జ్యో
త్స్నా పల్యంకశయానుపై అనలమున్
సారింతురే ? చంద్రికా
దీపజ్వాలిక నార్పఁజూచెదరు
గాదేవీరు - తారాసతీ
శ్రీపాణిగ్రహణమ్ము చేయుటకు
చేరెన్ కృతిమేందుచ్ఛటల్

నా పనియై పోయినదిక
ఆపై సూర్యునికి గూడ ఆపదవచ్చున్,
రేపోమాపో దివిపై
కాపుర ముండెదరు మనుజగణములు మిత్రా!

భువినుండి పైకి వెడలితి
భువికే అరుదెంచినాడ—పోనిక తారా
సవిధమున" కనెను చంద్రుడు
చివుక్కుమనె నామనస్సు, చింతించితినే—

చంద్రుని కోసమై వెతలు సైచె,
తపోనిధియైన వృద్ధ మా
నీంద్రునివీడె, నిందలన వెన్నొ
భరించె, నభో వినీల శై
లేంద్రమునన్ గృహమ్ము రచియించి
భయజ్వర బాధితాబ్జుని
స్తంద్రత గొల్పు చుండునది
తారక! ఆయమ కర్మమేమగున్

ఆయము వీడివచ్చిన మహా
దురితాత్ముని చంద్రుకొట్టగా
బోయితిగాని శాంతిగొని,
పొంగెడి దుఃఖముతోడ మల్లికా
చ్ఛాయల కూరుచుండి సరసమ్ముగ
— వానిని తార చెంతకుం
బోయెడి నటు చేయుటకు
బూనితి—నిట్లని విన్నవించితిన్

"ఒకడు వచ్చి వ్రాలె, ఒక్కడు మరికూలె
ఒకడు లేచి లేచుచుండి వ్రేలె,
ఒకడు తిరుగుచుండె నిక రేపొ యెల్లుండొ
కూలనుండె—బ్రతుకజాలకుండె

కాంతిలేని లోహకంజారులనుజూచి
చింత చెంది భూమిచేరదగునె,
వాని నెల్ల తార వలచునే యెందైన—
గుండెలేనివాని గోరునెట్లు?

హృదయమెల్ల అమృతనదిగా స్రవించెడి
నిన్ను బోలగలవె ఇన్ని కళలు
తారకా భుజాగ్ర తపనీయ చేలమ్ము
నందుకొనునె కృత్రిమేందు గణము.

ఈ యజాండాకృతికి సూర్యుడిందుడనెడి
రెండు కన్నులు వెల్గొందుచుండునెపుడు,
ఒకటి భువినెల్ల నిప్పుల నుప్పతింప
నొకటి కప్పురమున దేల్చు నుప్పరంబు.

నీవు వ్రాలదేని దేవునికొక కన్నె
డానబడును-దాన కలదుమంట
దయనుగూర్చునట్టి ప్రియనేత్రమే లేక
అతడు ప్రాణికోటి నార్తపరచు

చల్లనయ్యావు నీవుంట నెల్లజనులు
మండు వేసంగి భరియించుచుండినారు
పగటియెండను రేయెండవలని గెలిచి
ప్రేయసీ ప్రియులెట్లొ జీవించువారు.

హ్రాయమవీవు మాకు, మధురించెడి
కోర్కెల కొండమీద నీ
వుదయము కాగనే బ్రదుకులూయెల
లూగును-శాంతి చంద్రికా
స్పదమగు నీ నవాననము
ప్రాణులకున్ ప్రణయప్రకోపన
ప్రదము. నభోవిటంకమును
ప్రాకి మమున్ సుఖియింపజేయువే?

ఒక పక్షము మాపక్షముండి నీవు
మా వెతలుజూచి కృశియించిపోవగలవు.
ఒక్క పక్షమొరుల పక్షముండి వారి
పోడిమిని గాంచి ఉప్పొంగిపోవగలవు.

నలుపే అందముగా వరించిన
అనంతవ్యోమకాంతామణీ
విలసిద్దివ్యముఖమ్మునందు సొగసుల్
బింబించు గోరోచనా
తిలకంబీవు-తమఃప్రపంచమునకున్
దీపంబ వీ, వస్మదా
దులకున్ దగ్గరివాడ వెందులకిటుల్
దుఃఖించుటల్ చంద్రమా!

ఉచ్చపదవి నొందియున్న నిన్ దరిసించి
క్రిందినుండి మెచ్చుకొందునేను
అద్దమందు వెలుగు ముద్దుల ముఖబింబ
మసలు ముఖముజూచి యలరినట్లు" —

అతడు నాదు వినతి నంగీకరించెను
ప్రాణికోటి సౌఖ్యవార్ధి దేలె
కృత్రిమేందువులకు రీఢాకరమ్మయి
తరుణచంద్రమూర్తి తారజేరె !



“త్రా మ సి”

ఇరులు నిశాసతీ భుజములెక్కి, శిరమ్మునెక్కి తారకా
తరుణి కపోలపాళికలు తాకి, విహాయసవీథి ప్రాకి. చం
దురు పయిసోకి, భూమిధర దుర్గమ వీథులదూకి, మెల్లగా
ధరపయి కాలుమోపిన వుదారముతై హరినీల కాంతులన్

ఇటుప్రాకి అటుప్రాకి ఇందు బింబాననా
ముఖముపై కస్తూరి బొట్టుపెట్టి
ఇటుదూకి అటుదూకి కుటిల నీలాలకా
భ్రుకుటికా ధనువు నంబకము కూర్చి
ఇటుసాగి అటుసాగి ఇందీవ రేక్షణా
పక్ష్మభాగములపై వచ్చివ్రాలి
ఇటువీగి అటువీగి మృగనేత్రి బంగారు
చెక్కిలిపై అగర్ చుక్క నునిచి

వెండి కొండపయిన మబ్బువిధము దోచి
చంద్రకేదారమున లేడిచాయ తిరిగి
ఆదిశేషునిపై విష్ణువై శయించి
చీకటులు కూర్చె నందమ్ము లోకమునకు.

ఇరులు కోకిలములై ఎచ్చోట కూయునో
అచ్చోట మధుమాస మవతరించు
ఇరులె తుమ్మెదలుగా ఏవేళ పాడునో
ఆవేళల వసంత మందగించు
ఇరులే మయూరమై ఎట నాట్యమాడునో
ఆటనే నవాషాఢ మావహించు
ఇరులె ఉత్పలములై ఏనాడు పూచునో
ఆరోజు కార్తికమ్మాగమించు

ఇరులకన్న అందమెచట కానగరాదు
ఇరులె సౌఖ్యములకు దరులు సుమ్మ
ఇరులులేనినాడు నరులు కానగరారు
నరులులేనినాడు ధరణిలేదు.

కబరీ భరమ్ములై కనుపించు చీకట్లు
కలకాల మందాలు చిలుకుగాత
నల్లకల్వలవోలె ఉల్లసిల్లెడు నిరుల్
కాసారములలోన గ్రాలుగాత
నీలమేఘమ్ములై నింగి బ్రాకెడి తమం
బాకాశమున నడయాడుగాత
జవరాలి కనుపాపఛాయ దోచెడు సాంధ్య
మెడదలో వలపు వర్షించు గాత

ఇరులె కురులయి ఝరులయి పరుగులెత్తి
ఇరులె కరులయి హరులయి ఇంపునింపి
ఇరులె విరులయి సరులయి ధరణినిండి
ఇరులె నరులకు మరులు కల్పించుగాత.

తిమిరలతా కుడుంగమున దీపము పెట్టెడి వెర్రిదాన! దీ
పముపురు, వంధకారమొక పాము: పృదాకువు పుర్వుమెక్కునో
కృమి ఉరగమ్ము మ్రింగునొ గ్రహింపుమి! అంధతమో మహోతురం
గము ఖురఘట్టనమ్ముల వికావికలైనవి దీపదీధితుల్.

వెచ్చదనములేని వెర్రిదీపమ్ముల
పెట్టదలచెదేల పిచ్చిదాన.
వర్షధారవోలె వచ్చు చీకట్లలో
మట్టి దివ్వె నిలుచు మాటకల్ల

గాలినాల్కమీది కంటకమ్ములలోన
చిక్కుకొన్నయట్టి చిన్నపురుగు
అంధకారమందు ఆటాడుదీపంబు
మరుని మునమునందు మడియగలదు

ఆకాశమ్మది చీకటిల్లు, శశితారారాకావళుల్ మిణ్గురుల్
లోకంబియ్యది చీకటింటి పరదాలో రాగు మృత్పిండ: మిం
దా కల్పింపగ జూచెదేల పరిహాసార్థమ్మె! దీపావళీ
ప్రాకారమ్ములు? తానుసీధరణి కంపంబల్లదే వచ్చెడిన్.

కానుగు చెట్ల నీడల నొకానొక స్వప్నపు సెజ్జమీద ని
ద్రాణత హాయిగొల్పగ సదాశయనింపగనీ మహాంధకా
రాన మనస్సు శాంతిగొనె, నను భవత్ కమనీయ కాంతి సౌ
ధానకు, నన్ను పిల్వకుము తన్వి! విభావిభవాభిరామవై.'



* "ఊర్వశి"

నందనవాటికాతలమునన్ నివసించెడి ఊర్వశీ! భవత్
సుందరదేహవల్లి పరిశుద్ధవిభాతమువోలె అందముల్
చిందు, హిమావగుంఠనము లేక నిసర్గమనోజ్ఞకాంతితో;
బందివికావు స్వైరిణివి ప్రాజ్ఞవు స్వాగతమే సురాంగనా!

అపరసంధ్యా ప్రశాంత సూర్యాతపమ్ము
శాద్వలమ్ముల కాంచనాంచలము విసర
గృహిణివై పయ్యెదబిగించి హృదయనాథు
నింట సందియదివ్వె వెల్గించలేదు

వజవజ వడంకు పాదాల, వడకుచున్న
వక్షమున, నమ్రనేత్ర మందాక్షశోభ,
శోభనాగారమును చేరజూడనటి
పెండ్లి యెరుగని ప్రణయ చాంపేయమీవు.

విషపాత్రమొక్కచే సుధాకలశమున్ వేరొక్కచే బూని నీ
వుషసిన్ క్షీరసముద్రమందుదయమై, ద్యోవాసులున్, రాక్షసుల్
ఋషులున్ మానవులున్ సమస్తజగముల్ కీర్తింపగా ప్రేమసం
తుషితస్వాంతమునన్ జగత్త్రితయమందున్ వెల్గినావూర్వశీ !

---

* రవీంద్రుని రచనకు అనుసరణ

పుట్టినయప్పుడే యువతిపోలిక నిండగు యౌవనమ్మునన్
మెట్టితివీ ధరాతలము; నిన్ను శిశుత్వము చిన్నమంతయున్
ముట్టగలేదటే, పసిడిబొమ్మల చేకొని ఆడలేదటే
తొట్టెలలోన పట్టివలె తొంగలి రెప్పల నవ్వులొల్కుచున్?

వాయువు, నీవు త్రావిన నవాసవవాసనలూని ఓ జగత్
ప్రేయసీ, ఊర్వశీ! పరుగువెట్టును మత్తిలి నాల్గుదిక్కులన్;
నీ అరుణాంబుజాత కమనీయపదమ్ముల మ్రోయు మత్త భృం
గాయిత శింజినీధ్వని ప్రియంబొనరించె కవీంద్రకోటికిన్.

చంచల కాంచనాంచల లసన్నవ వక్షము పొంగుదేర, నే
త్రాంచల బాణపాతముల ధ్యానసమాధి నిషణ్ణమౌ నిరాట్
సంచయ మానసమ్ములు ప్రసన్నములై అదిగో తపః ఫలం
బుంచెను నీపదాలకడ! ఊర్వశి! దాని పరిగ్రహింపవే!

ఒడలెల్లన్ పులకాంకురంబులు సముద్యోతింప నీ వాడినన్
జడరాశుల్ నటియించ బూనినవి స్వేచ్ఛావృత్తి; నీకంఠమం
దుండుహారమ్ము తెగన్ నభోంగణము నందొప్పారె తారారాశి;నీ
నడుమల్లాడగ మేఖలల్ తెగి దిగంతాలందు వ్యాపించెడిన్

సురలోకంబను పూర్వశైలమున సంశోభించు ప్రత్యూషసుం
దరివీ పూర్వశ్రీ! సప్తలోకములు నిన్ సౌందర్య సింహాసన
స్థిరసంవాసినిగా నెరింగి కొలిచెన్ దేవీ! మదీయాంతరాం
బురుహంబందు భవత్ పదంబులిడవే పూజింతునే వేళలన్.

కొంకులు తాకునట్లసిత కుంతలముల్ విరబోసి నీవు, మీ
నాంకుని ఆడురూపమయి నావు దిగంబరి! దివ్యకాంత! ఎ
ణాంకుడు పశ్చిమాంబునిధియందు మునింగినయట్టులింక నా
వంకకు రాకపోయెదవె పైదలి! అశ్రులుదోయిలించినన్

పొంగిన నీ ఉరోజముల పొంకము, నీ చెలువంబుజూపుక
న్నుంగవ, నీ కపోలములనున్న దనంబు, యుగాలుపాడినన్
బొంగురువోని నిగళము నొక్కులు దేరిన నీ నవాలకల్
నింగియు నేలయుం బలెనెనిల్చును శాశ్వత యౌవనంబునన్



"దీపాంగన"

దీపశిఖనిల్చినది పురంధ్రీలలాట
పట్టిదీర్చిన కుంకుమ బొట్టువోలె,
దీపశిఖపిల్చినది; చనుదెంచినాను
తనువు తనువెల్ల ఆజ్యపాత్రమ్మువోలె॥

ఎరకలు వచ్చెనా యెడద కిప్పుడు,
దీపకుమారికా భుజాం
బరమున పోయివ్రాలెదను; పాడెద,
మంచులు పేరినట్టి ఈ
ధరణి జడత్వ మూడ్చుటకు తాపము
పెంచెద, వేడిలేని ఈ
పరిసరముల్ కవోష్ణరసవారిధిలో
నెసలాడ జేసెదన్॥

నాకుఁ దీపశిఖాకుమారకకు ఈనాడా!
శతాబ్దాల ముం
దే కానుండెను పెండ్లి; కాని పవన
ద్వేషమ్ము దీపానకున్
నాకున్ మధ్య నఖాతముల్ నిలిపె;
నైనన్ దాని చేలాంచలం
బాకంపించె మదీయ శీర్షమున
ప్రేమామోద సంవాహమై॥

శలభమనైన నన్ శరభ సామజ
సింహాబలంబు లిచ్చి ది
వ్వెల దొరసాని పెంచినది, ప్రేముడితో
ముడివేసి వాన గా
డ్పుల తొలిదాడినాడు నను బ్రోచిన
దెంతటి రాగబంధమో!
చలియనలేదు దీపక భుజా
భుజగీ పరిరంభణమ్మునన్॥

బందీ యయ్యె జగమ్ము దీపకళికా
ప్రత్యగ్ర బాహా యుగం
బందున్ నాయెదవోలె; అంధ తమస
వ్యాధూత కోకారి వ

న్నిందా బంధురలోకమున్ విడచి
మద్దీపనా లింగ నా
నంద స్యందన మెక్కి రివ్వుమని పోనా
స్వర్గమార్గములన్॥

ప్రతి యింట చిన్న ప్రమిద వెల్గించిన
అవిరళ స్నేహ రాజ్యాధిరాజ్ఞి,
ప్రతిగుండె నొక ప్రభాప్రతిమ నిర్మించిన
కల్పనా నల్ప శృంగార రాణి,
ప్రతి తోటలో నవప్రసవమై విచ్చిన
కాంతార కాంత వాసంతలక్ష్మి,
ప్రతిమానవి ముఖాంబరమందు ప్రాకిన
గోరోచనా చంద్రచారుమూర్తి

దీపభామిని, ఆశాతి దీప్తకీర్తి,
మంచు కరగించి, వేడికల్పించి, వాగ్వి
పంచి సవరించి వాయించి ప్రకృతినెల్ల
మూర్ఛ తేరిచి చేతనాంబుధిని దేల్చె॥

కాలిన రెక్కలన్ పులుగు కైవడి
నీ పదకంజ సన్నిధిన్
వ్రాలితి. నిన్ను మ్రింగుటకు
వచ్చిన గాడపు దుండగినితో
ఆలము సేసి గెల్చుకొనునప్పుడు
రెక్కలు కాలిపోయె నీ
జ్వాలలసోకి; నీ కొరకు ప్రాణములైన
పణమ్ము వెట్టెదన్॥

నీలో తేజము తగ్గిపోవునెడ నందింతున్
కవోష్ణాస్రమున్
తైలంబట్టుల - అశ్రుధారలను
సంతప్తాజ్యధారంబలెన్;
జ్వాలాచేలవిలోల తావక వపుర్వల్లీ
విలాసంబుతో
భూలోకంబును సొంత మొక్కత్రుటి
సమ్మోహింపగా జేయవే॥

నన్ను స్నేహము చేసికొన్నావునీవు
వెల్గుచున్నావు నా మనః పీఠిపైన
ప్రతిరుధిర బిందువును సమర్పణ మొనర్చి
నిన్ను వెల్గించుటకు మరణింతునేను॥

నీ కేలా పరిచుంబితంబయిన నా
స్నిగ్ధాధరోష్ఠమ్ముపై
ప్రాకెన్ కమ్మదనాలు ద్రాక్షరసమై, ప్రత్యగ్ర
మాధ్వీకమై;
లోకాతీత సుఖమ్ము కూర్చినవి నీ
రోచిష్ణు బాహాయుగ
ప్రాకారాంతర జృంభమాన
లికుచాభ స్వర్ణ వక్షోజముల్॥

వెలుతురు మొగ్గవై బ్రతుకు వీధుల
నూత్న పరీమళమ్ములన్
జిలికిన నీకు గాను విరచించితి
గుండియ కొండమీద ది
వ్వెల రతనాల మేడ, పదవే అట
నుందువుగాని. కోటి గుం
డెల వెలిగింప గల్గు రమణీ నిను
గాడుపు పాలొనర్తునే॥

నీ నృతిజూచి లోకము ఖణిల్లను
గజ్జెలతో నటింపగా
బూనెను, జారిపోయినదిపో, భవ
దంస గతాంబ రాంచల

శ్రేణి, కటీ పటంబు శిథిలీకృతమయ్యె.
వివస్త్రివై శివే
రాణి, * రవీంద్ర కల్పిత విలాసిని,
ఊర్వశివోలె, దీపికా!

నిను కౌగింటను గొన్న నా తనువు పోనే
పోవుగానీ, భవత్
తను తేజః పరిణాహపింజరితమీ
ధాత్రీతలంబెల్ల, ఆ

త్మను గావేసి వసింతు సప్త జగతీ
మధ్యమ్మునన్ దీప భా
మిని ప్రేమించిన దీప్తిమంతుడనుగా
మిన్నెక్కి క్రీడించుచున్॥



రవీంద్రకవి ఊహించిన ఊర్వశి వివస్త్ర

" చీ క టి న టి "

తెరలు తెరలుగా చీకటి
దిగెను జగతి నడినెత్తిని
ఎంతని ముట్టించగలను
ఈ దీపపు చిరువత్తిని?

చీకటి శిల తెచ్చి చెక్కె
శిల్పియొకడు ప్రతిమనొకటి
ఆతని ఉలిముక్కు బల
మ్మనగా అది యయ్యెనటి

దీపాలను దిగమ్రింగెడి
పాపి సమీ చీకటినటి!
అందుకొనగ చేయిసాచ
అందబోదు దానికటి

అందమైన చీకటినటి
కందరు 'వందే' యందురు
చురుకగు నాయమ నల్లని
చూపుల బందీలందరు

నా గుండియ వితర్దిగా
నాట్యము సాగించినది
ఇక తూరుపుదెస వెలుతురు
తెగయవో అనిపించినది

వెలిగించితి క్రొవ్వువత్తి
పేల్చివేయ పెనుకానుగు
క్రొవ్వువత్తితో ఈల్గునె
క్రొవ్విన చీకటి ఏనుగు?

అంతలోనె అరుణ పద్మ
మటుల విచ్చె తూర్పున శశి,
బ్రతుకులోని చీకటి విడి
పగలనిపించినది నిశి.



"చేతనా జ్యోతి"

ఒక పరిజాతువా మెరుగు లొల్కెడి జ్వాలిక.
ఒక్కమారు మ
ల్లిక కుసుమించినట్లవతరించెడి కీలిక,
ఇంద్రనీల వ
ల్లిక వలె నొక్కనాలుక వెలింగెడి దీపిక
తోచెనాకు, గై
రికల వెలుంగు హైమశిఖరింబలె
ఉత్తర దిక్కువై పునన్॥

కొప్పువలె ధూమరేఖను కూర్చి చుట్టి
పూవుగా ఒక జ్వాలను పొదిగి పెట్టి
పైటగా ఒక్కకీలను వైచినట్టి
దీపికా గోపికా పురంధ్రికి నమస్సు॥

కామినీ ఫాలభాగాన గోరోచనా
తిలకమై వెలిగెడి దీపమొకటి,
సుందరా రామాన మందార కళికయై
నవ్వుల గురిపించు దివ్వెయొకటి.

కాసార నవజల ప్రాసాదమునుండి
నలినమై తోచు తిర్వెళక యొకటి,
అపర సంధ్యావేళ అస్తాద్రి శిఖమీద
సూర్యుడై కొడిగడ్డు జ్యోతి యొకటి,

కామినీ నయనమ్ముల గాంచనొకటి
ప్రేయసీ హృదయాన కన్పించునొకటి
బాహిరంబైన వెలుగును పరచునొకటి
అంతరంబైన కాంతినీయగల దొకటి॥

ఎవరు ముట్టించినారే ఈ ప్రేదీపమ్ము
లెవరి గుండియమంట కివ్వివ్యాఖ్య,
లెవరు కల్పించినారే ఈ విభా తోరణా
లెవరి గేహమ్ము లాశించెవీని,
ఎవరు పోషించినారే ఈ ప్రభావల్లి
నెవరితోట పరిమళించు కొరకు,
ఎవరు నిర్మించినారీ కాంతి సౌధమ్ము,
నే ప్రేమదేవి వాసించు కొరకు,

ఎవ్వరే ఎవ్వరే ఇట నెవ్వరెవ్వ
రంధకార బంధుర హృదయాంగణమున
వద్దు వద్దన దీపాల పంక్తి పేర్చి
విరుగబడి నవ్వుచున్నారు వెఱ్ఱివారు?

నాకు బంధువులటే నలిన బాంధవతేజ
మొలకబోసెడి దీపకళికలార,
నాకు స్నేహితులటే చీకటిగుండియ
కలవరపెట్టు తిర్విళకలార,
నా సహాధ్యాయులైనా నన్ను కాపాడ
వచ్చిన వహ్ని పుష్పమ్ములార,
నా వోలె బాధాపి నద్ధమానసముల
నరుదెంచు జ్వాలాజయంతులార,

చారు కాశ్మీర వర్ణశృంగారచేల
నెదపయిన్ నృత్యమొనరింప పమును దేరి
ఎఱ్ఱబారిన నయనమ్ములతే ప్రదీప
ములుగ నరుదెంచు సఖులార! పలుకరేమి ?

నిశ్శబ్దమ్ముగ ప్రేమకుండ గతవహ్నిన్
భస్మమై పోవు ప్రే
యశ్శిలుర్ గదమీరు! నా బ్రతుకు
నాజ్యంబట్లు మీకిచ్చి మీ
దోశ్శాఖాచలిత ప్రభాంచలము చేతుల్
కాలినన్ ముట్టెదన్
నిశ్శంకంబుగ మీ పథంబువలె పోనిత్తున్
జగద్వాహామున్॥

హారివిల్లువలెవిచ్చి ఆకాశ భూదేశ
ములకు కిర్మీరతాకలనకూర్చి
పూర్ణిమా సాంధ్య కర్బురశశాంకునివోలె
ఉదయాచలమ్ముపై పదముపూని
అకుసుంభరాగ విన్యస్త మానసమట్లు
నిశ్చలమ్ముగ హావణించి మించి
పై చూపుకన్నను లోచూపు మిన్నను
సూక్తికి వాస్తవ ద్యుతులునించి

అజ్ఞతకు బద్ధ శత్రువై, అవికలాంత
రంగ సద్బంధువై, త్యాగి సంగమునకు
ప్రోత్సహించెడి గురువయి, ప్రోజ్జ్వలించు
జ్ఞానదీపమ్ము విశ్వమ్ము కాచుగాక ॥

గుడిసెలో నొక చిన్నికూన కన్నులలోన
నవ్వులు చిలికించు దివ్వెయొకటి,
బంగారు మేడలోపల కొత్త కోడలి
చూపుల నాటాడు దీపమొకటి,
గగనాంధకారాన సొగసైన మోముతో
ధగధగ మెరసెడి తారయొకటి
ఉరు వలాహక శయ్య నొంటిగా శయనింప
జాలక పొరలెడి చపల యొకటి,

ఒక్కటొక్కటే యేతెంచి చెక్కబట్టి
లాగుకొనిపోవు నన్నె దేలా ? అగాధ
బాధలోనుండి ఆనందగాధలోని
కీడ్చుకొనిపోవ యత్నించు నేలనన్ను?

ఎరకలు కాలిపోవునని యెంత యెఱింగియు
గూడ దీపికా
తరుణినవోప గూహనము తప్పుకొనక
బ్రయత్నింపబోని, ఈ
పురుషుల ప్రేమ బంధమును బోలునే,
గొప్పలు చెప్పుచున్న ఈ
నరుల యథానుకూల
కుహనావచనాంచిత రాగ బంధముల్



"ఆశా సౌధం"

వుండడానికో సౌధం
వుండక పోయినాగానీ
ఆశాసౌధాన్నైనా
అధిరోహిస్తే తప్పా!

నా ఆశాసౌధం గోడలు
నరుతే! దానవులు కారు;
నా ఆశాసౌధం నీడలు
నావే! నరపతులవి కావు.

కొందరు పరాయినీడల్లో
వుండామనుకుంటూరు;
తన్నినప్పుడల్లాను
తన్నులు తింటుంటూరు.॥

నా నీడే నాకువుండగా
పరాయి నీడలు దేనికి?
నా గోడే నాకుండగా
పరాయి గోడులు దేనికి?

అంతా వెనకటేవుందని
ఆనందపడే పెద్దలు
ఇవాళ యేమీ లేదని
యేడ్పు మొహం పెట్టారు.

వాళ్ళ యేడ్పు పోగొట్టే
వసంత సమయాలెన్నడో
వాడిపోయి ఈ నాటికి
వర్ష ఋతువు వచ్చింది!

విశాల భూలోకాన్ని
విడగొట్టి దేశాలుదేశాలుగా
తన్నుకు చస్తున్నారు;
ఎక్కడి ఖర్మం బాబూ! ఇది.

మనిషి మనిషినీ విడగొట్టే
ధనాన్ని నిర్మూలించామంటే
నరులంతా యేకమై
సురలోకం నిర్మించరూ?

ఈ నాటి ఆశాగీతికి
భవిష్యత్తు ప్రతిధ్వని;
ఈ నాటి నెగెటివ్‌కి
భవిష్యత్తు పాజిటివ్.

భవిష్యత్తు అనగానే
భయపడతారెందులకు?
వర్తమానపు పునాదుల్లో
భవిష్యత్తు నా సౌధం ॥

కొంపలు గోడలు లేనీ
కూలీ రైతుల్లారా!
అంతా రండయ్యా! నా
ఆశా సౌధంలోకి

ఆశాసౌధ గోపురాన
అదిగదిగో ఇంద్ర ధనువు;
ఆసౌధం వాకిటిలో
సామాన్యుడికి స్వాగతం ॥

"జలద సరస్వతి"

ఆకసము జూచినంత గ్రీష్మాతపార్తి
భీకరంబయి గుండియదాక మండు;
లోకమెల్ల పయోధరా లోకనార్ద్రి,
శీకరస్నాన సౌఖ్యమాశించు నేడు॥

నల్లని వేణికాభరమునన్
రవిబింబము డాగిపోవగా
చల్లని చూపులన్ మొయిలు
జాడల వైద్యుతవల్లి కాఁవల
గ్రొల్లసి తాంగికై యురుము
లూరక గర్జియలట్లు మ్రోయ, నా
యుల్లమునందు వార్షుక
పయోధర భామిని నాట్యమాడెడిన్॥

అదిగో! పశ్చిమ వార్ధిసాచిన
కరంబై మేఘమే వచ్చుచు
న్నది. మార్తాండుని చేయి పట్టుకొని
పంతంబార కొంపోవుచు
న్నది; గ్రీష్మాతప తప్యమాన జన
చింతా స్వాంతముల్ శాంతిలున్
గద! నీలాంబుధర ప్రమోదకర
తద్గర్జాని నాదమ్ములన్ !

కామినీ ధమ్మిల్లకంబయి తూర్పున
చిరుమబ్బులే తున్క చెంగలించె,
ప్రేయసీ భుజలతా వేల్లి తాంచలరీతి
నొకమబ్బు దక్షిణానకు తొలంగె,
భామా పయోధర భారమ్ము తలపింప
నొక మేఘ ముత్తరానకు చరించె,
కాంతాపదాంక సంకాశమ్ములై మబ్బు
ముక్కలు నడిమింటి కెక్కినిలచె,

వివిధ ముద్రలతో నాట్యవేదిపైన
నృత్య మొనరించు నర్తకి రీతిదోచె
తీవ్రవాతూల పక్షపత ప్రవజప్ర
ఘాత సంధూత జీమూత గణము నేడు ॥

చేజేయి కలిపి పచ్చిక బయళ్ళ చరించు
        నూత్న దంపతియయ్యె నొక్కముబ్బు,
విరహాబాధాత ప్త తరుణియై తలవంచి
        కన్నీరునించె నొక్క జలదంబు.

స్నానమాడుటకయి నదికేగి నీరాడి
        చనుదెంచు తన్వియోజనొక మేఘు,
మాలింగనార్థినియై బాహువులు సాచి
        ఉరికి వచ్చెడికాంత ఒక్కమొయిలు,

నేనెనై మిన్నుదారుల నిలచునొకటి,
తానయై వ్యోమభాగాన తరలునొకటి,
విడివడిన ప్రేయసీ ముఖబింబమూని
ప్రక్కప్రక్కన నిలుచుండ వచ్చునొకటి ॥

నవనీరద రథమ్ము నడిపింతు దివిదాక
        పవమాన జవనాశ్వ పటువిబూన్చి,
మందాకినీ కంజ సందోహ గంధమ్ము
        నిండింతు నీ భూమిమండలమున,
ప్రోదినీ వల్లికా వ్రాతముల్ తెచ్చి నా
        తోటలో నీటుగా నాటగలను,
నరులతో సురల చుట్టరికముల్ పెరుగగా
        ధరకు నాకమును తొందరగ తెత్తు,

భూదివము లేకమై కాంతిపుంజమట్లు
నీల నీలాంబరమ్మున తేలియాడ
అచ్చరల వెంట మేఘ పల్యంకి నెక్కి
వానదారుల పయనింప వలతునేడు ॥

మేఘమందు నాక మోహమ్ము సంప్రీతి
మబ్బు పంచభూతమయమె కాదె!
అంతెగాక దాన నలరారు కరుణమ్ము
గుండె కంటినీటి కుండ గాగ ॥

మబ్బులోన వింధు మదవతీ పాద మం
జీర యుగళ మంజు శింజితమ్ము
మబ్బులోనకందు మానినీ నయనాంత
గళిత బాష్ప బిందు కణగణమ్ము ॥

మూగివానినోట రాగాలు పాడించ
ఇసుక నేలలందు మిసమినించ
సాగివచ్చె నేడు జలదసరస్వతి
కాళ్ళ హంసకములు గల్లుమనగ ॥



"మహాంధ్ర"

నాలుగుకోట్ల తెల్గుల మనంబులలోన
మహాంధ్ర లక్ష్మి దీ
పాలను పెటినట్టి శుభవాసరమియ్యది!
నూర్ల యేండ్ల స్వ
ప్నాలు నిజాలుగా మొలచి పందిరి ప్రాకి
సుమాలుపూచి లో
కాలకు సౌరభమ్ములను కానుక పెట్టిన
రోజు-పైదలీ !

అటుపోయి 'కృష్ణ' లో నటనంబు లొనరించి
సిక్త చేలమ్ముతో చేరరమ్ము,
ఇటుపోయి 'గోదారి' ఇసుకతిన్నెల ధూళి
పాదాల పారాణ వైచరమ్ము,

ఇటు 'పినాకిని' కౌగిలింతల తడిసియైన
వక్షమ్ము పొంగార వచ్చిపొమ్మ.
అటు మంజు 'మంజీర' మడుగుల గల్లన
ఒయ్యారముగ నడలూది రమ్మ.

కావిరంగు చీరధరించి; కారునలుపు
పయ్యెదపయిఁ జరీ బుటాపని సెలంగ
ఫాలభాగాన దీపమ్ము వలె తిలకము
వెలుగులొలికింప రావమ్మ తెలుగుచాన ॥

బ్రతుకు విపంచి మూగవడి పాడక యుండిన
తీగతీగ కు
న్నతి గలిగించి, అంగుళులతాకి
పదమ్ములు పాడు మా సర
స్వతివి, మరాళవాహనముపై నొక మా
రిటువచ్చి పొమ్ము. మా
నతులను స్వీకరింపుము కనచ్ఛర దిందు
వ పుర్విలాసినీ ॥
ఓరుగల్లు పురాన నుదయించి గగనమ్ము
ప్రాకిన తెల్గు పతాకవీవు,
విద్యానగరమందు విప్పారి వెల్గిన
సాహితీ చంద్రమశ్శకల మీవు,

ఇక్ష్వాకురాజుల కిలవేలుపైన౦ది
కొండనుండిన మల్లెదండ వీవు,
కొండవీట సెలంగు దండివీరుల భుజ
దండమ్ము దూకిన చండివీవు,

పోతనామాత్యు భాగవతాది మధుర
గీతికలలోన పలికిన కీరమీవు,
కవికలమ్మున గళమున చవులుగూర్చు
స్వామినీ! కవితా సరస్వతివి నీవు॥

నీవు లేకున్నచో నేనేడ జగమేడ
దారిలేనట్టి యెడారిగాక,
నీవు రాకున్నచో భావమంజరు లేడ,
శిశిర జర్జర వన శ్రేణిగాక,
నీవు లేకున్నచో నిత్యయౌవన మేడ
వార్ధక భ్రష్ట జీవనముగాక,
నీవు రాకున్నచో నింగి తారక లేడ
గాఢాంధకార మేఘములెగాక,

అఖిల సారస్వతోద్యానమందు, పొగడ
పూవనై గుమ్మనెదు నిన్నుపొగడ తరమె,
రమ్మ! నా రసవా నృత్యరంగమందు
నర్తనము సేయవమ్మ ఆంధ్రసుకుమారి!

తిరుపతి కొండపై తిరిగి వత్తమురమ్మ !
శిఖరాగ్ర సితమేఘ చేలమూని,
భద్రాచలముపొంత పవ్వళింతము రమ్మ
శ్రీరాము సీతా ప్రసిద్ధభూమి.
శ్రీశైల వనముల చేరిపోదమురమ్మ
మల్లికార్జును దివ్యమహిమ నెంచి
సింహాచలమ్మున చెంగలింతమురమ్మ
కొండమల్లెలు మెడనిండదాల్చి.

అడుగడుగునందు నందనోద్యానములును,
అంగుళమ్మంగుళమ్ము పుణ్యస్థలమ్ము
గా వెలయు తెల్గునేల సింగారమొప్ప
తెల్గుదనమొల్కువే దశదిశలలోన.॥



"వాగ్వజ్రం"

మనిషి మనసును గెలుచు మాటనారాధింతు
మాటలోపలి వజ్ర మర్యాదనెంతు

మనసులోపలి బండలను చెండగలమాట
మనిషిలోపలి దౌష్ట్యమును ద్రుంచగలమాట
హిమగిరీంద్రమునెక్కి ఎగసిపోగలమాట
అమృతభాండము తెచ్చి అందించగలమాట

రాక్షసుని గుండెలో రాతిని ద్రవింపించి
భిక్షువుకు బ్రతుకుపై ప్రీతి కల్పించి
కత్తులకు తలవంపుగావించి, క్రొంబూల
గుత్తులకు రాగ సంపత్తి జోడించి

రణదాహ ఘోర తాపమున బీడై యున్న
మనిషి మేధాభూమి మరలపండింతును.
మనిషి మనసుకు శాంతి మధురుచి చూపించి
యుద్ధ విష పాత్రికను బ్రద్దలొనరింతును

కత్తులా? మనుజలోకము పూనవలసినది?
పుత్తడిని చేబూని మురెయువలెనా మనము?
సకలార్థములకు పోషకమైన మనసుపై
స్వారిసేసెడి శబ్దశక్తి నారాధింతు

మాట కడుపున నున్న జ్వాలపై కెగసెరా
మరి పయోధులెఱుంకు మందరాద్రి వడంకు,
నరహోమమునకు సన్నాహమ్ము లొనరించు
అసురగుండియల వజ్రప్రహారము జరుగు

నరజాతి చించి చెండాడ లేచిన చేయి
తెగి నేలబడును నా సొగసు పద్దెపుజడికి
పొగరెక్కి కోట్లడబ్బును కిరీటమ్ముగా
తగిలించుకొన్న గర్వికి భయము నా సడికి

మనకు తల తెగగొట్టు పనిలేదు. డబ్బుతో
కొనుబాధలేదు మానవుని నీ విపణిలో;
రమ్మా! సూటిగ హృదయరంగాన నటియించి
రాక్షసిని దేవతా రమణిగా మలచుదము

లంకగా గాక కైలాసమ్ముగా జగము
రాణించునటు పునారచన చేతమురమ్మా!
ఈ పునారచనలో ఎవ్వనిది పైచేయి?
కవిది, లోకజ్ఞునిది, గంభీరునిది, నీది.



"మధ్యప్రాచ్య మహాయజ్ఞం"

ప్రజాస్వామ్య యజ్ఞానికి
ఫలితం కనపడుతున్నది
గాజుబుగ్గ పగిలినట్లు
రాజరికం విడుతున్నది

నిన్నదాక నిదురించిన
అన్నా! మేల్కొన్నావా?
తఱకులను యజ్ఞవాటి
శిక్షిస్తున్నావా ?

ధనంమీద కోర్కెమాని
జనంమీద ప్రేమబూని
ప్రజాద్వేషి వర్గాలను
పతనం చేస్తున్నావా ?

మతం మత్తు వదల్చుకో
మానవులను పిల్చుకో
ప్రాణాలను పణంపెట్టి
ప్రజాబలం తేల్చుకో

కన్ను తెరచి పిరమిడ్లే
మిన్నుమన్ను చూస్తున్నవి
అఖిల మానవులవై పే
అరబ్ జాతి వస్తున్నది

తెల్ల పెత్తనందుల్లెను
దేవుడతుతలు చల్లెను
అరబ్ జాతి నిరుపేదల
ధరణి విడిచ్చి శనివెళ్లెను

పరాకుతో నిద్రించే
ఇరాకురాజుల ఇంట్లో
ధరాకంప మేతెంచెను
కిరీటాలనే దించెను

గెలిచినాడు మానవుడే
క్రిందపడెను దానవుడే
ప్రజాస్వామ్య నవపతాక
ప్రాకిపోయె నింగిదాక

సత్యానికి గెలుపన్నది
సత్యంరా మానవుడా !
అన్యాయంతో స్వర్గం
అందదురా దానవుడా !

సర్పయాగ మొనరించే
జనమేజయులారా !
వేయికండ్లతో శత్రుల
వీక్షిస్తున్నారా !

యజ్ఞఫలం దొంగిలించ
నరుదెంచే వారి నొంచ
జాగరూకులై చూడుడు
స్వాతంత్ర్యం కాపాడుడు

* నీలనదీ జలధారలు

నరాలలో గలవారలు

స్వాతంత్ర్యోద్యమ వీరులు;

వారికివే జోహారులు.



* River Nile

"ఎవరి పాదచిహ్నము లివి?"

ఎవరి పాదచిహ్నములివి? -
ఎవరి పాదచిహ్నములు?

ఆతని ప్రతిఅడుగు గురుతు
ఆలయమై తలయెత్తును
ఆతనిచేయి గొడుగు క్రింద
అఖిలజగము శయనించును.

దానవులను కరగించిన
మానవుడత డెవ్వడు?

గుండెనొడ్డి తుపాకీల
గుండె పగులగొట్టె నతడు;
రాటంతో రణశూరుల
ఈటెల నెదిరించె నతడు

హిమాలయము కన్న నెత్తు
ఎవడాతం డెవ్వడు?

ప్రతి మానవ హృదయమ్మున
నొదిగిపోవ జాలు నతడు,
విశ్వములో ప్రతిప్రాణిని
ప్రేమించగ జాలు నతడు

కత్తికి కన్నీరుగార్చు
కరుణా కరుడెవ్వడు?

విష మిచ్చినవాని కమృత
చషకమిచ్చె నాతడు,
కారాగారము స్వర్గము
గా మారచె నాతడు

తరతరాల మన సంస్కృతి
తానై నిలిచిన దెవ్వడు?

"ఓపిక" రూపం దిద్దుక
ఉరికివచ్చు నతనిలో—
"శాంతి" శరీరమ్ము బూని
సాగివచ్చు నతనితో-

"మంచి" మరాళము వోలిక
మసలు నతని మనసులో-

"క్షమ" శిశుశశి నవరేఖా
సదృశమయ్యె నతని శిరసి
"ఔదార్యం" అతని నుండి
అమర వాహినిగ దూకును

ఎవరిని తనువు గతాగతము
లేకమైన యటులతోచు?
ఎవని చిన్ని నివాసము
అవనికి కైలాసము?

గుండెలలో ఆతడున్న
కొంచెము నేపాపుడీ
కన్నులలో ఆతడున్న
కాస్త నాకు చూపుడీ !

ఎవరి పాదచిహ్నము లివి
ఎవరి పాదచిహ్నములు?

"మహాంధ్రావృతము"

రక్తకాంచన తరుప్రతతి శారదవేళ పూవులతో పొంగిపోయినట్లు
శశికాంత పాషాణచయము వెన్నెలలలో కరగి నీరై కాల్వ
గట్టినట్లు,
చంద్రబాహుద్వయీ సాంద్రోపగూహమ్ము కల్హారమునకు
పుల్కలిడినట్లు
రాజహంసీ గరుద్రచిత బాలతరంగ రంగవల్లి సరోజలమ్ములట్లు
తరతరమ్ముల చీకటి బరువులుడిగి, వానమబ్బుల కర్దమపథము
కడిగి
నాల్గుచెరగు లొక్కటైన నాల్గుకోట్ల తెలుగులో కాన
చైతన్య మలమికొనియె.

ఒకవైపు కృష్ణవేణిక ఉబ్బితబ్బిబ్బులై సాగి తెల్గింటసేసపెట్ట,
ఒక క్రేవ గోదావరికి హర్షల హారికానాట్యంబు ప్రస్పందనంబు
గూర్ప
ఒకప్రక్క తుంగభద్రకు చాయవెన్నెల కెరటాలు తెలుగు
సంబరము చేర్ప
ఒకదారి మంజీర చకపికనడలతో తెల్గుతల్లికి తరితీపుసేయ,

సుజలలైయె తెల్గుతల్లి సంశోభిలంగ, సుఫలయై తెల్గుధాత్రి
విస్ఫూర్తిజెంద,
బిదరుపురినుండి వంగాబ్ధివేలదాక ఏకమైపోయె తెల్గువారిల్లు
నేడు.
ఎన్నినాళ్ళ స్వప్నమిది సత్యమైనది? ఎన్నినోళ్ళ పిలుపుకిది
జవాబు?
నాల్గుకోట్ల వికచ నాళీకములు గల ఆంధ్రసరసి కిది మహా
ప్రభాతము.

వానతెరలు తొలచివచ్చిన శారద దేవతాకరస్థ దివ్యపాత్ర
తొణకి అమృతధార దోసిటంబడినది త్రావుడాంధ్ర పుత్రులార!
మీరు.



"విస్మృతి పానపాత్ర"

విస్మృతి పానపాత్రయయి వెచ్చని శీధురసమ్ముతోడ-ని
న్నే స్మరియించు నాకొరకు నేడరుదెంచునుగాని గాటమౌ
నీ స్మితరేఖ నాహృదయ నీరధరమ్మున ప్రోదినీ లతా
విస్మయకృత్ప్ర ఖాపటలి పెంపుననిట్ల తలపించు నంబికా!

నెలమొల్క తలఁజెక్కి ఇలనున్న ఇరులెల్ల
తరలించ నరుదెంచు దైవతమవు
గంగాంబుభంగాళి పొంగించి ఆకాశ
భూదేశముల్ నింపు పుణ్యనదివి
మంచువై అంచవై మల్లికా వల్లివై
వెన్నెలై వెల్లువై వెల్లుసతివి
మగువవై మగనివై జగతికే ప్రగతివై
జననివై నరులపై కొనెడు ఉమవు

ఆదిలక్ష్మికన్న ఐరావతముకన్న
కౌస్తుభమ్ము కల్పకమ్ముకన్న
అసలు తల్లికన్న అధికురాలవు నీవు
అందరికిని తల్లివగుట కతన.

తల్లివై పక్వాన్నము తరువు సెక్కించెద
వెన్నిపండ్లైన భుజించు మనచు,
అక్కవై ఆకాశమంత పైకెత్తెద
వెంతగానైన గర్వించుమనుచు,
నవవధూనికవుగా నన్ను లాలించెద
వెన్నొజన్మల బంధమిదియటంచు,
చెల్లెవై నన్నుగిచ్చి పకుంగులెత్తెదు
కోపతాపాలు రాగూడదనుచు

మాతృదీప్తి, వధూనికా మధురతృప్తి
సోదరీత్వం పరివ్యాప్తి పొదుకొనిన
విశ్వమాతవు; నినుపోల్పు విధమెరుంగ;
పార్వతివో, పద్మవో, సరస్వతివో జనని!

ఒకకొన్ని జాజిపూలకు కేలుసాచెడి
వనము వోలినది జీవనమునాది
ఒక కొంత గానమ్మునకు వీను నిక్కించు
నినువు బోలినది మానసమునాది

ఒక చిన్ని వెల్గురేకకు నేత్రపుటి నిచ్చు
తమ్మివోలినది అంతరమునాద
ఒక కొద్ది తీపి మాటకు ఉబ్బి తబ్బిబ్బు
లయిపోవు చిరుతప్రాయమ్మునాది

నీవు నవ్విన నవ్వితి. నీవుకంట
నీరు వెట్టిన ఆనీటి ధారలందు
కొట్టుకొనిపోతి లోకాల కొట్టకొనకు,
తిరిగి రానైతి దుఃఖసాగరమునుండి.

నిను మరచిపోవ బ్రయతించితిని, సవిత్రి !
మరపురావేమి? గుండియ తెరలు తొలచి
కెరలిపడెదేమి? క్షీరసాగరమువోలె
ధరణి ముంచెత్తు నమృతాంబుధరమువోలె.

పగుల గొట్టితి విస్మృతి పానపాత్ర,
బ్రతుకు బ్రతుకెల్ల నీకయిపరచినాను
అమృత సింహాసనమ్ముపై అధివసించి
ఏలుకోవమ్మ ఏడులోకాలు నేడు.

"వ ధూ ని క"

ఎదపొదలో జిక్కి ఎటు పోవజాలని
లేడికి మేత కల్పించునెవతె
కన్నీటివానలో కడునాని రెక్కలా
డని పక్షి నోడినుంచు కొనునదెవతె
దుఃఖ ఝంఝూనిలోద్ధూత పుష్పమునకు
కబరికాపీఠమీ గలుగునెవతె
ఆకురాలిన గుండె బ్రమాకు కూకటిలోన
చిగురుటకుతలను చిమ్మునెవతె

పలుకజాలని భగ్నవిపంచి బూని
తీవెసవరించు శారదాదేవి యెవతె
భారతీ, రమా, ఉమా సమాహారమైన
మాతృత్రితయ స్వరూపిణి, భ్రాతృజాయ.

చీకటి జీవితమ్మునకు చిక్కనివెన్నెల పాలువోసి, చీ
కాకులచిక్కులన్ చివికి కారియవడ్డమనమ్ము బ్రమోదు మా
రాకులు హత్తగా అమృతహస్తము సాచి వసంతశాంతవే
శాకుట జాంత కుట్మలవిలాసము చూపెదవే వధూనికా!

వానకాలమందు కానలకోనల
చెట్లకొమ్మలందు చిన్నిగూట
రెక్కగొడుగు క్రింద డొక్కలప్రక్కన
పట్టిగాచు తల్లిపిట్ట వీవు

కైలాస శిఖరమ్ము కలదు నీ ఫాలాన
కాశికాపురమింక కావలయునె,
కల్పభూజమ్ములు కదలేని ఎదలోన
వాసంతలక్ష్మి కావలెనె నాకు,
పుష్కలా వర్తకాంబుదము నీకనులలో
వాసింప ప్రపలు కావలెనె నాకు
నీ పాదములు పద్మ నికాశములు కాగ
లేమి కల్మలను చర్చించనేల

అన్నపూర్ణవై నీవింటనున్న యపుడు
తిండికై తిరిపెమెత్తి తిరుగనేల
సింధువై నీవు వాకిట జేరువార
అంధువున స్నానమాడగా నరుగనేల

భ్రాతృజాయా కరస్పర్శనొందిన వల్లి
శిశిరమ్మునకు భీతి జెందబోదు,
వదిన పాదాంబుజ ద్వయిమెట్టిన గృహంబు
అంధకారము జూచి అడలబోదు

ఆమె కటాక్షవీక్షా మరందములాని
వేపకొమ్మల చేదు విరిగిపోవు
మా వధూనిక మృదుమధుర హాసమ్ములో
దుఃఖాలు పలుచనై తొలగిపోవు

ఉదయ కాలార్క బింబంబు మృదుకరాల
ఆమెపాదాల పారాణ నద్దిపోవు
సాంధ్యవేళా శశాంక కాషాయబింబ
మామె నఖముఖముల రాగ మద్దవచ్చు.

ఆమె జగత్కుటుంబిని, దయామయి ఆదిసవిత్రి, భూదివ
స్స్వామిని, దీనబాంధవి, విషాదభరాంతర శాంతి కృత్చిరం
టీమణి, ఆమె పాదములనే స్మరియించెద జీవితాంతమున్,
నామది యామెకున్ గృహమనన్ రచియింతు ననేకపద్యముల్.

అమృతాభిషేకము

ఎదగుడిలో సరస్వతి వసించి విపంచికమీటి పాడు చు
న్నది; నవచైత్రమాస గహన స్వప్రహాణేయః లాశసూన సం
పదకు ఉగాదిమండనము మంజులమైనది నేడు: తెల్గు శా
రద కమృతాభిషేక మొనరన్ కవితాంజలిబూని రండహో!

కలతలులేని చక్కని ఒకానొక సౌధముకట్టి, దానిలో
పల కవితాసరస్వతికి వజ్రకిరీటము పెట్టి రేబవల్
కొలుతము రండు, ఘర్షణలకున్ కలహమ్ముల కాలనాఁపా
ఇలకు ప్రశాంతి కల్పకమహీజము తెండు జనాళి మెచ్చగన్.

ద్వేషాగ్ని యార పీయూషధారలు వార
పద్యాలకొన్నింటి పాడవలయు
కాఠిన్యములుడింద కరుణమ్ము పెంపొంద
పదములగొన్నింటి పాడవలయు
విని మెల్ల ఝల్లగా రసముప్పతిల్లగా
వివిధభావముల కల్పించవలయు
అసహానమ్ముల ద్రుంచ నైకమత్యము పెంచ
నిర్మలస్నేహమ్ము నించవలయు

వేపపూవులలో చేదు విరిగిపోవ
రసనపై తీయమాటలు విసరవలయు
ఉదయమే లేని గాఢాంధహృదయమందు
చిత్రభాను సూనము వికసించవలయు

ప్రతికలమ్ములోన పద్యాలు వ్రాసెడి
దండిదనము నిండుచుండ వలయు
ప్రతి గళమ్ములోన పాటలు పాడెడి
ఇంపుదనము లావహింపవలయు

చుఱ్ఱుమనెడి యెండకఱ్ఱులు సాచిన
లేళ్ళనోళ్ళ నిన్ని నీళ్ళుపోసి
లతలతోడ చిన్ని రమణీయగేహమ్ము
కట్టి పవ్వళింప బెట్టవలయు

కడు నిరాశతోడ కళవళపడుచున్న
ఎదకు నవవసంత మీయవలయు
చిక్కిపోయనట్టి చెట్టుచెట్టున పూల
యౌవనమ్ము పొంగిపోవవలయు

ఈ యమృతాభిషేకమున కెందరు సత్కవులేగు దెంచి నా
రోయి మరంద మాధురుల సూను లసత్ కవితాప్రసూనముల్
దూయిటబూని? వారి ఎదలోన వసంతము లావహించి చాం
పేయ పరిమళమ్ములను వీచిన వష్టదిశాంతరమ్ములన్

చిరువేపకొమ్మపై చేరి తీయనిపాట
పాడుచున్నది చిల్కపడతి యొకతె
మండిపోయెడి యెండ మరచిపోవగ ప్రపా
శాలలో చిరునవ్వు చాన యొకతె
ఒగరుమాని చిగుళ్ళు తెగమెక్కి గళమెత్తె
గాయని - కోకిల కాంత యొకతె
ఎట్టగా పాలాశమట్టు సాచినచోట
చల్లగా నిదురించె మల్లెయొకతె

శిశిర శుష్కానిలమ్ముల చివికియున్న
వనములో పూలుపూచెను వల్లియొకతె
ప్రాతబడి పోయినట్టి సంవత్సరమున
కాలుమోపెను క్రొత్తయుగాది యొకతె

ఆ ఉగాదికాంత అంగుళుల్ తాకిన
తీవె తీవె పూలు ప్రోవుబోయు
ఆమె పాదతలము లంటిన ఇరవెల్ల
నందనమ్ము వోలె అందగించు

ఆ యమకోసమై - బ్రతుకుటామని శైశిరశాతుసీకర
చ్ఛాయల గ్రుమ్మగిపోయినను సైచి దినాంత నిశాంత వేళలన్
కోయని కూసికూసి గళ గుంజనలన్ జగమున్ జయించి మా
కోయిల కుట్టవాడు కడకున్ దరిసించె నుగాది జవ్వనిన్

ఆమ్రశాఖాశోభి హైమాంశుకమునుండి
ముఖచంద్రబింబంబు మురిసిపోవ
చిరువేపకొమ్మపై సింగార మొలికించు
చేలాంచలమ్ములు జీరువార
శోకాపహాశోక సుందరాగమునుండి
కనకాంగదమ్ములు ఘల్లుమనగ
వివిధరాగాలాప విధిచొక్కు ప్రేంకణ
మ్మామెతో జతగూడి ఆలపింప

పూలతో పండ్లతో నవనారికేర
జలముతో శుకపిక కలకలముతోడ,
అరుగుదెంచె నుగాది సుందరి, మహాంధ్ర
కవిత కమృతాభిషేచనోత్సవము జరుప.



